నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 30 జనవరి 2025 | KARIMNAGAR



# దళిత విజయం

ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారు దిగొచ్చింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దళిత బంధు పథకంపై తన వైఖరిని మార్చుకున్నది. దళితుల నిరంతర పోరాటాలు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చట్ట సభలు, సమీక్షా సమావేశాల్లో గళమెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం పద్నాలుగు నెలలుగా ఖాతాలపై విధించిన ఆంక్షలను ఎత్తేసింది. పోలీసుల నిర్బంధాలు, అనేక అడ్డంకులను ఎదుర్కొంటూ హుజూరాబాద్ దళితులు చేసిన పోరాటంతో రాష్ట్రంలోని దళితులకు న్యాయం జరిగినట్టయింది. దళిత బంధు ఖాతాలపై ఫ్రీజింగ్ తీసేయడంతో నియోజకవర్గంలోని 8,148 మంది దళిత కుటుంబాలకు రెండో విడుత సాయం అందబోతుండగా, ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం కసరత్తు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది.

- పద్నాలుగు నెలలుగా ఫ్రీజింగ్‌లో దళితబంధు ఖాతాలు
- అలుపెరుగని పోరుసాగించిన దళితబిడ్డలు
- అండగా నిలిచిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- ఎట్టకేలకు దిగొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 8,148 దళిత కుటుంబాలకు ప్రయోజనం

## దళిత బంధుపై ఆంక్షలు ఎత్తివేత



హుజూరాబాద్ టౌన్: కేసీఆర్, పాడి కౌశిక్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): దళితుల జీవితాల్లో వెలుగులు నింపి, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'దళిత బంధు'ను తెచ్చారు. మొదటగా హుజూరాబాద్‌ను పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. 2021 ఆగస్టు 15న అక్కడే ప్రారంభించి దళితుల్లో ఉత్తేజాన్ని నింపారు. పథకం అమలు కోసం సర్వే నిర్వహించిన అధికారులు నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ మండలాల్లో 18,021 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఒక్కో యూనిట్‌కు ₹10 లక్షలు మంజూరు చేసిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ₹9.90 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసి, ₹10 వేలు దళిత సంక్షేమ నిధికి జమ చేసింది. అయితే, లబ్ధిదారులు ఎంచుకున్న యూనిట్లను బట్టి కొంతమందికి పూర్తి స్థాయిలో, మరి కొంతమందికి అవసరాన్ని బట్టి ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ రకంగా 9,873 మందికి పూర్తి స్థాయిలో ఆర్థిక సాయాన్ని అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, మిగిలిన 8,148 మందికి వారి అవసరాన్ని బట్టి ఆర్థిక సాయాన్ని విడిపించుకునే అవకాశం ఇచ్చింది. మిగతా మొత్తాన్ని విడుదల చేసేందుకు కసరత్తు జరుగుతుండగానే 2023 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావడం, ఎన్నికల కమిషన్ దళితబంధు పథకంపై ఆంక్షలు విధించడంతో రెండో విడుత ఆర్థిక సా యం లబ్ధిదారులు విడిపించుకోలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికి లబ్ధిదారుల ఖాతాల్లోనే ఉన్న నిధులను ఎన్నికల తర్వాత కూడా విడిపించుకోవచ్చని భావించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ ఖాతాల్లో ఉన్న దళిత బంధు ఆర్థిక సాయాన్ని తమ వ్యాపార అవసరాలకు విడిపించుకునే ప్రయత్నం చేశారు. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో దళితబిడ్డలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. 14 నెలలుగా ఖాతాలను ఫ్రీజింగ్ ఉంచడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### ఆందోళనలు.. కేసులు

తమ ఖాతాల్లో ఉన్న డబ్బులు తాము విడిపించుకునేందుకు ప్రభుత్వ ఆంక్షలేమిటని దళితబిడ్డలు అధికారులను ప్రశ్నించారు. తాము ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయక తప్పదని అధికారులు బదులిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు దళిత బంధు సాధన సమితి పేరిట ఒక వేదికను ఏర్పాటు చేసుకుని ఆందోళనలు ప్రారంభించారు. అనేక పోరాటాలు, నిరసనలు జరిగాయి. ప్రజావాణిలో విన్నవించుకోవడం మొదలుకుని ధర్నాలు, రాస్తారోకోలు అనేకం జరిగాయి. అధికార కాంగ్రెస్ మినహా బీఆర్ఎస్ సహా వివిధ రాజకీయ పక్షాలు వీరికి మద్దతుగా నిలిచాయి. నిరంతర పోరాటాలు చేస్తున్న దళిత బంధు సాధన సమితిపై పోలీసుల ఆంక్షలు మొదలయ్యాయి. దళితులు ఏదైనా నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిసిన వెంటనే వారిని అదుపులోకి తీసుకోవడం, పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం మొదలు పెట్టారు. దీంతో దళితుల్లో మరింత పట్టుదల పెరిగి, కొద్దిరోజుల క్రితం వేలాది మంది హుజూరాబాద్ పట్టణాన్ని దిగ్బంధించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వారికి మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పోలీసులు దళితులతోపాటు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై విచక్షణారహితంగా విరుచుకు పడ్డారు. ఎమ్మెల్యే సహా పలువురు గాయపడ్డారు. పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. దళిత బంధు సాధన సమితి నాయకులు కొలుగూరి సురేశ్ సహా పలువురిని 23 సార్లు వివిధ పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు.

### గళమెత్తిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

దళితబంధు విషయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా తనకు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ గళమెత్తారు. అసెంబ్లీలో రచ్చ రచ్చ చేశారు. జడ్పీ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట దళితబంధుపై అధికారులను నిలదీశారు. గొడవ పెరడగంతో ఆయనపై పోలీసులు కేసు పెట్టారు. ఈ నెల 12న కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సమక్షంలో కూడా దళితబంధు లబ్ధిదారులు ఆర్థికంగా ఎదుర్కొంటున్న పరిస్థితులపై విన్నవించారు.

### దిగొచ్చిన సర్కారు

దళితులపై ఎన్ని ఆంక్షలు విధించినా వెరవకుండా దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో వరుసగా ఆందోళనలు చేస్తూ ప్రభుత్వానికి సెగ పెట్టారు. ఈ నెల 22న జమ్మికుంటలో ఒక సభ కూడా నిర్వహించారు. ఫిబ్రవరి 5లోగా దళిత బంధు రెండో విడతపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకుంటే తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తామని దళితులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దిగి వచ్చినట్టయింది. దళితబంధు లబ్ధిదారుల ఖాతాలపై ఆంక్షలు తొలగిస్తూ ఆదేశాలు ఇచ్చింది.

### దళిత బిడ్డల ఆనందహేల

అయితే దళిత బంధు ఖాతాలపై ప్రభుత్వం 14 నెలలుగా ఆంక్షలు విధించడంతో లబ్ధిదారులు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారు. రెండో విడుత ఆర్థిక సాయం అందుతుందని భావించి అప్పులు తెచ్చుకుని వ్యాపారాలు నడుపుకొంటున్నారు. ఆర్థికంగా లేక పోవడంతో పూర్తి స్థాయిలో వ్యాపారాలు నిర్వహించుకోలేక పోతున్నారు. కొందరైతే బిజినెస్ పక్కన బెట్టి మునుపటిలా కూలీ నాలీ చేసుకుని బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పథకంపై ఆంక్షలు తొలగించడంతో దళితులు తమ విజయంగా భావిస్తున్నారు. నిత్య పోరాటాలతో ప్రభుత్వం దిగొచ్చి దళిత బంధు రెండో విడుత నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేసిందని లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు ఆనందపడ్డారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. హుజూరాబాద్‌లో కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంచుకున్నారు. జమ్మికుంటలోని తెలంగాణ చౌక్ వద్ద దళిత సంఘం నాయకుడు మంద రాజేశ్ ఆధ్వర్యంలో 'దళిత బంధు'వులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

### షెడ్యూల్‌తో ఆలస్యం

అధికారులు తీసుకునే నిర్ణయంపైనే ఇప్పుడు చర్చ జరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 9,937 మంది దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడుత కింద ₹324.75 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఒక్క హుజూరాబాద్ నియోజకవర్గంలోనే 8,148 మందికి ₹271.60 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఈ నెల 27న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ అనుసారంగా దళిత బంధు రెండో విడతపై ఆంక్షలు తొలగించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలో మరోసారి పరిశీలన జరిపే అవకాశం ఉన్నది. అయితే, బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో మరికొన్ని రోజులు ఆగాల్సిన పరిస్థితి అనివార్యమైంది.

#### అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే

దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి కేసీఆర్ దళిత బంధు పథకాన్ని అమలు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, దాదాపు 18వేల కుటుంబాలకు ₹10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించడం ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల ఖాతాలపై ఫ్రీజింగ్ విధించింది. రెండో విడుత కింద వారికి చెందాల్సిన లబ్ధికి అడ్డుకట్ట వేసింది. ఈ క్రమంలో దళితుల తరపున తాను అలుపెరుగని పోరాటం చేసి, ప్రభుత్వం మెడలు వంచడం సంతోషంగా ఉన్నది. ఇప్పటికైనా దళిత బంధును పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. లేకుంటే పోరాటాలకు సిద్ధంగా ఉంటాం.

**- వీడియో సందేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

# హామీల అమలు కోసం బీఆర్ఎస్ పోరుబాట

## నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు


కార్పొరేషన్, జనవరి 29: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గులాబీదండు పోరుబాట పట్టింది. అధికారంలోకి వచ్చి 425 రోజులవుతున్నా అమలు చేయకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిరసనలు తెలుపబోతున్నది. గాంధీ విగ్రహాలకు నివాళులర్పించి, వినతి పత్రాలు సమర్పిస్తున్నట్టు బీఆర్ఎస్ జిల్లాల అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, జీవీ రామకృష్ణారావు, తోట ఆగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటనలు విడుదల చేశారు. విజయవంతం చేయాలని శ్రేణులకు సూచించారు.

### కోడ్ రాకతో ఆంక్షలు

- కొత్త పథకాల ప్రకటన, ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయద్దు
- కొత్త పనుల మంజూరు, ఆర్థిక గ్రాంట్లు ప్రకటించరాదు
- ప్రభుత్వ భవనాలను రాజకీయ సమావేశాలకు ఉపయోగించరాదు
- సరైన పత్రాలు లేకుండా ₹50 వేల కంటే ఎక్కువ నగదును తరలించరాదు
- దేవాలయాలు, చర్చిలు, మసీదులను ప్రచారానికి వినియోగించరాదు
- ప్రైవేట్ భవనాల యాజమానుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించరాదు. గోడలపై రాతలు రాయవద్దు
- స్థానిక అధికారుల అనుమతులు లేకుండా పార్టీలు గానీ, అభ్యర్థి గానీ బహిరంగ సమావేశాలు నిర్వహించరాదు

### ఇదీ షెడ్యూల్

- నోటిఫికేషన్ విడుదల తేదీ : ఫిబ్రవరి 3
- నామినేషన్ల దాఖలుకు గడువు : ఫిబ్రవరి 10
- నామినేషన్ల పరిశీలన : ఫిబ్రవరి 11
- నామినేషన్ల ఉపసంహరణ : ఫిబ్రవరి 13
- పోలింగ్ : ఫిబ్రవరి 27 (ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు)
- ఓట్ల లెక్కింపు : మార్చి 3






# ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగారా

## పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ల షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్
- మధ్యన ఉన్నది 24 రోజులే
- అమల్లోకి వచ్చిన కోడ్
- అప్రమత్తమైన అధికారయంత్రాంగం
- ప్రత్యేక దృష్టి సారించిన ప్రధాన పార్టీలు
- ఇప్పటికే రంగంలోకి ఆశావహులు.. జోరుగా ప్రచారం
- టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై ఫిర్యాదుల వెల్లువ

**కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు నగరా మోగింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. తక్షణమే కోడ్ అమల్లోకి వస్తుందని ప్రకటించగా.. అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమిస్తుండగా, ఈసారి పోరు రసవత్తరంగా ఉండే అవకాశమున్నది. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఆశావహులు ఇప్పటికే పోటాపోటీగా ప్రచారం చేస్తుండగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విషయంలో ప్రచారం అదే స్థాయిలో జరుగుతున్నది. పాఠశాలల సమయంలో ఓ సంఘం ప్రచారం చేస్తున్నదని టీచర్ ఎమ్మెల్సీ విషయంలో ఫిర్యాదులు అందగా, అధికారయంత్రాంగం చర్యలకు సిద్ధమైంది. అనూహ్యంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టిపెట్టగా, విజయం కోసం ఈసారి అన్ని పార్టీలు సర్వశక్తులూ ఒడ్డే అవకాశం కనిపిస్తున్నది.**

కరీంనగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ సభ్యుల పదవీ కాలం వచ్చే మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమైంది. అందులో భాగంగా మొదట ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తూ గతేడాది సెప్టెంబర్ 30న పబ్లికేషన్ జారీ చేసింది. గత అక్టోబర్ 16, 25వ తేదీల్లో రెండు దఫాలుగా పత్రికలకు ప్రకటనలు ఇచ్చింది. ఆ మేరకు నవంబర్ 6 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత మరోసారి చాన్స్ ఇచ్చింది. 2019 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు సైతం ఈ సారి తప్పనిసరిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని స్పష్టం చేసింది. గడువులోగా దాఖలైన దరఖాస్తులను పరిశీలించి డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను అధికారయంత్రాంగం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నిజానికి ఫిబ్రవరి రెండో వారంలోనే నోటిఫికేషన్ వస్తుందని అందరూ భావించారు. కానీ, అందరి అంచనాలకు భిన్నంగా షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు.

**బుధవారం (ఈ నెల 29) నాటికి గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

| జిల్లా | మండలాలు | గ్రాడ్యుయేట్స్ ఓటర్లు | టీచర్స్ ఓటర్లు |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 15 | 6050 | 469 |
| మంచిర్యాల | 18 | 31199 | 1619 |
| ఆదిలాబాద్ | 18 | 14836 | 1588 |
| నిర్మల్ | 19 | 17015 | 1953 |
| నిజామాబాద్ | 33 | 31101 | 3622 |
| కామారెడ్డి | 25 | 16218 | 2111 |
| జగిత్యాల | 20 | 34803 | 1777 |
| పెద్దపల్లి | 14 | 30615 | 1083 |
| కరీంనగర్ | 16 | 70564 | 4218 |
| రాజన్న సిరిసిల్ల | 13 | 22300 | 890 |
| సంగారెడ్డి | 28 | 23542 | 2682 |
| మెదక్ | 21 | 12214 | 1314 |
| సిద్దిపేట | 22 | 32133 | 3095 |
| హన్మకొండ | 4 | 4497 | 160 |
| భూపాల్‌పల్లి | 5 | 2438 | 81 |
| మొత్తం | 271 | 3,49,525 | 26,662 |

### సత్తాచాటిన పట్టభద్రులు, పంతుళ్లు

ఓటర్ నమోదులో భాగంగా నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ అంచనాలకు మించి జరిగింది. ఔత్సాహిక అభ్యర్థులు ఎన్‌రోల్‌మెంట్ చేసేందుకు పోటీ పడడం, అధికారులు కూడా విస్తృత ప్రచారం చేయడం వల్లే ఎక్కువగా జరిగినట్టు తెలుస్తున్నది. తాజా లెక్కల ప్రకారం (జనవరి 29వరకు) చూస్తే.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 3,49,525 మంది ఓటుకు అర్హులుగా అధికారులు తేల్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 26,662 మందిని అర్హులుగా గుర్తించారు. నిజానికి 2019లో జరిగిన ఎన్నికల్లో 1,96,321 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. అప్పటితో పోలిస్తే.. ప్రస్తుతం 1,53,2041 మంది పట్టభద్రులు అదనంగా ఓటు హక్కు పొందారు. నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నది. ఇదే పరిస్థితి ఉపాధ్యాయుల్లోనూ కనిపించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 2019లో జరిగిన ఎన్నికల్లో 23,214 మంది టీచర్ ఓటర్లుగా ఉండగా, ప్రస్తుతం 26,662 మంది ఉన్నట్టు లెక్క తేల్చారు. అప్పటితో పోలిస్తే ఈసారి 3,448 మంది పంతుళ్లు అదనంగా ఓటు హక్కు పొందారు.

### అప్రమత్తమైన పార్టీలు

2019 ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి సంబంధించి 17 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తాజా పరిస్థితులను బట్టి చూస్తే ఈసారి అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తుండగా, ఇప్పటికే పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి చాలా మంది ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిని నిశితంగా పరిశీలిస్తే ప్రస్తుతం 15 కొత్త జిల్లాలున్నాయి. వీటి పరిధిలో 271 మండలాలు, 43 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలు, నియోజకవర్గాల్లో పరిచయం, రాజకీయ అనుభవమున్న చాలా మంది ఆశావహులు ఈసారి ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ స్థానంలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపడమేకాదు, ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా వివిధ వృత్తుల్లో కొనసాగుతున్న వైద్యులు, అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమకు సంబంధించిన వర్గాలను కలుస్తూ మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. అలాగే ప్రధాన పార్టీలు సైతం ఈ స్థానంపై ఫోకస్ పెట్టాయి. లక్షలాది మంది పట్టభద్రులున్న నియోజకవర్గంలో విజయం సాధించి, తమ శక్తిని చాటాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రత్యక్షంగా అభ్యర్థులను నిలబెట్టకపోతే పరోక్షంగానైనా మద్దతివ్వాలని కొన్ని పార్టీలు చూస్తున్నాయి. తాజాగా నోటిఫికేషన్‌తో ప్రధాన పార్టీలు సైతం ప్రత్యేక దృష్టిసారించాయి. టీచర్ ఎమ్మెల్సీకి సైతం ఈసారి పోటీ బాగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే సంఘాలు మద్దతు ఇవ్వకపోయినా స్వతంత్రులుగా బరిలో దిగేందుకు ఇప్పటికే కొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారు.

### ఫిర్యాదుల పరంపర

ఇప్పటికే కొంత మంది ఆశావహులు ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఒక సంఘం నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడిచే సమయంలో ప్రచారం చేస్తున్నట్టు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందాయి. సదరు నాయకులు క్యాలెండర్, డైరీల అవిష్కరణ ముసుగులో ఈ ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తున్నది. పాఠశాలల వేళల్లో ఏ పరిస్థితుల్లోనూ ప్రచారం చేయరాదని, అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. అయినా ఆ ఆదేశాలను పక్కన పెట్టి.. కొంత మంది ఉపాధ్యాయసంఘ నాయకులు ప్రచారం చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రచారంపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు.. జిల్లా విద్యాధికారితోపాటు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తున్నది. ఈ విషయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సీరియస్‌గా తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

# ఇసుకాసురులు

- కోర్కల్ మానేరువాగు నుంచి అక్రమ రవాణా
- నిత్యం వందలాది ట్రాక్టర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

వీణవంక, జనవరి 29 : ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు! నిబంధనలను కాలరాస్తూ ఇసుక దందాకు పాల్పడుతున్నారు. కోర్కల్ మానేరు వాగు నుంచి రెడ్డిపల్లి, ఘన్ముక్ల, మల్లన్నపల్లి మీదుగా శంకరపట్నం, హుజూరాబాద్‌కు పగలూ, రాత్రి అనే తేడా లేకుండా తరలిస్తూ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు.. లైసెన్స్ లేని డ్రైవర్లతో తీసుకెళ్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకొని అక్రమ రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

## కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 29 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దిశానిర్దేశం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, బస్టాండ్, పబ్లిక్ పార్క్ వంటి ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై ఉన్న రాతలను చెరిపివేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను కవర్ చేయాలన్నారు. బెల్ట్ షాపులు ఎక్కడ ఉన్నా మూసివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయి, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.